సున్నావడ్డీతో అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి

- వరుసగా నాల్గో ఏడాది బ్యాంకు ఖాతాల్లో వైఎస్సార్ సున్నావడ్డీ నగదు జమ
- ఆత్మకూరు డివిజన్‌లో 1.02.405 మందికి రూ.12.92 కోట్లు విడుదల
- నిధులను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి మెరుగు పరుచుకుంటున్న మహిళలు

జూపాడుబంగ్లా: పొదుపు సంఘాల్లోని అక్కాచెల్లెమ్మలను ఆర్థికంగా అభివృద్ధి బాట పట్టించాలనే తలంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ వంటి సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 11న వైఎస్సార్ సున్నావడ్డీ పథకానికి సంబంధించి నాల్గో విడత నగదును పొదుపు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో అక్కాచెల్లెమ్మలు హర్షం వ్యక్తం చేస్తూ తమ తోబుట్టువు జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ పాలనలో సున్నావడ్డీ పథకం అమలు చేయకపోవడంతో వారు బ్యాంకుల్లో తీసుకొన్న రుణాలకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. జగన్ సీఎం అయ్యాక ఏటేటా సున్నావడ్డీ మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటంతో ఆర్థికభారం తగ్గుతుండటంతో వారు అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు.

9,845 పొదుపు గ్రూపులకు ప్రయోజనం..

నాల్గవ విడత సున్నావడ్డీ కింద నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లోని 9,845 పొదుపు గ్రూపుల్లోని 1,02,405 మంది అక్కా, చెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో రూ.12,92,08,911ల నిధులను జమ చేశారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 5,337 పొదుపు సంఘాలుండగా 56,515 మంది సభ్యులకు సున్నా వడ్డీ కింద రూ.7,23,53,926 విడుదలయ్యాయి. అలాగే శ్రీశైలం నియోజకవర్గంలో 4,308 సంఘాల్లోని 45,890 మహిళలకు రూ.5,68,54,985 వారి ఖాతాల్లో జమ అయ్యాయి. జూపాడుబంగ్లా మండలంలోని 887 పొదుపు గ్రూపుల్లోని 9,153మంది మహిళలకు రూ.1,20, 60,596ల నిధులు జమ అయ్యాయి.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అక్కాచెల్లెమ్మలు

ఆర్థికంగా రాణిస్తున్న అక్కాచెల్లెమ్మలు

ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలతో అక్కాచెల్లెమ్మలు ఆర్థికంగా రాణిస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాలతో ఏడాదికి కనీసం రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తోంది. దీనికితోడు బ్యాంకు రుణాలు తీసుకొని కుటుంబ పోషణ నిమిత్తం కిరాణం దుకాణం, చీరల వ్యాపారం, తిరుతిండ్ల తయారీ వ్యాపారం, పాల్లెక్క పెంపకం, కుట్టుమిషన్ నిర్వహణ వంటి పలురకాల వ్యాపారం చేసుకుంటూ రోజుకు రూ.500ల నుంచి రూ.800దాకా సంపాదించుకొంటూ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటూ కుటుంబాలను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు.

కిరాణ కొట్టుతో జీవనోపాధి మెరుగు



ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు నాలుగేళ్లుగా వైఎస్సార్ సున్నావడ్డీ పథకం వర్తిస్తుంది. ఈ పథకంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాల వెల్లింపు భారం తగ్గి, ఉపశమనం లభిస్తుంది. అలాగే వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా వచ్చిన నగదుతోపాటు బ్యాంకులో కొంత రుణం తీసుకొని ఇంటివద్ద కిరాణం కొట్టు పెట్టుకున్నాను. తద్వారా రోజుకు ఖర్చులు పోను రూ.500ల ఆదాయం లభిస్తుంది. దీంతో జీవనోపాధిమెరుగు పడింది.

– నాగేశమ్మ, పారుమంచాల

చీరల వ్యాపారం పెట్టుకున్నాను



ప్రభుత్వం నాలుగేళ్లుగా ఇస్తున్న వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలతో వచ్చిన నగదుతో పాటు కొంత నగదు పొదుపులో రుణం తీసుకొని ఇంటివద్ద చీరల వ్యాపారం పెట్టుకున్నాను. రోజుకు రూ.300నుంచి రూ.400ల ఆదాయం వస్తుంది. గతంలో వ్యవసాయ కూలీపనులకు వెళ్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడితే రోజుకు రూ.200ల కూలి వచ్చేది. ఇప్పుడు ఇంటివద్దనే ఉంటూ చీరల వ్యాపారం చేసుకొంటున్నాను.

– లక్ష్మి, తూడిచెర్ల

మహిళలు అభివృద్ధిబాటలో పయనిస్తున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకం నగదును మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం హర్షించదగిన విషయం. మహిళలు డబ్బును వృథాగా ఖర్చుచేయకుండా కుటుంబ పోషణకు అధిక ప్రాముఖ్యత ఇస్తారు. సంక్షేమ పథకాలను వినియోగించుకొని చాలా మంది మహిళలు కుటుంబ పోషణలో కీలకమవుతున్నారు. ఇప్పటికే చాలా మంది మహిళలు ఇళ్లవద్ద పలురకాల వ్యాపారాలు చేస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు.

– అంబమ్మ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం

ఓపెన్ ఇంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: దూర విద్య ద్వారా ఇంటర్మీడియెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి అనివార్య కారణాల వల్ల ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందని విద్యార్థులు దూరవిద్య ద్వారా ఇంటర్ చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు అడ్మిషన్లు పొందే అవకాశం ఉందని వివరించారు.

పోలీసులపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

నందికొట్కూరు: ముద్దాయిని పోలీసులు వేధించినట్లు తప్పుడు ప్రచారం చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని రూరల్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 31వ తేదీన పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామం సమీపంలో నర్సన్న బావి వద్ద బైక్ నిలిపిన గంగి హరిప్రసాద్‌కు, గంగి వెంకటరమణ పోన్‌లో మాట్లాడుతుండగా అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ నడుపుకుంటూ వచ్చిన కోమటి రామాంజనేయులు బైకును గుద్దాడన్నారు. దీంతో వారిద్దరికి గాయాలవ్వగా కర్నూలు వైద్యశాలకు తరలించారని చెప్పారు. కేసు నమోదు కావడంతో బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. చట్ట ప్రకారం కోర్టులో రాజీ అయితే కేసు కొట్టేస్తారు. ఆ తరువాతనే బైక్ తీసుకెళ్లాలని చెబితే వేధిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం నేరమన్నారు. సమావేశంలో ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఈఓ

మహానంది: మహానంది క్షేత్రంలో కొలువైన శ్రీ ఆంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామివారిని తమలపాకులు, వడలతో చేసిన మాలలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆకుపూజ, సిందూర అలంకారం, సహస్రనామ అర్చనలు వైభవంగా జరిగాయి. శ్రావణమాసం, షష్ఠి పర్వదినంను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసినట్లు పండితులు తెలిపారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పంటలసాగులో మెలకువలు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు

మిడుతూరు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం సైంటిస్టులు డాక్టర్ రామకృష్ణారావు, డాక్టర్ సరళమ్మ అన్నారు. మంగళవారం మిడుతూరులో పత్తి పంటను పరిశీలించారు. పత్తిసాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా గులాబీ రంగు పురుగు నివారణపై ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణ, వేరు కుళ్లు తెగుళ్ల వలన నష్టం వాటిల్లుతుందన్నారు. వీటివలన నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌సీఏడీపీ మంజువాణి, ఆత్మ బీటీఎం ఉమాదేవి, ఏ ఓ పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శాప్ చైర్మన్ రూ. 50 వేలు విరాళం



గ్రామస్తులకు నగదు అందజేస్తున్న జగన్‌మోహనరెడ్డి

మిడుతూరు: మండలపరిధిలోని 49-బన్నూరు గ్రామంలో నిర్మించతలపెట్టిన కొమ్మ గుడి నిర్మాణానికి ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన తరఫున బైటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహనరెడ్డి గ్రామ పెద్దలకు నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బలరామయ్య, శ్రీనివాసులు, సుదర్శనరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

108లో చెంచుగిరిజన మహిళ ప్రసవం



108 లో బిడ్డకు జన్మనిచ్చిన చిన్ననాగమ్మ

ఆత్మకూరు: మండలంలోని పెచ్చెర్వు చెంచుగూడెనికి చెందిన గిరిజన మహిళ చిన్న నాగమ్మ 108లో మంగళవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. పెచ్చెర్వు గూడెంకు చెందిన చిన్న నాగమ్మకు మంగళవారం సాయంత్రం పురిటినొప్పులు రావడంతో స్థానికులు ఆటవీశాఖ అధికారులకు తెలిపారు. వారు 108కు సమాచారం అందించారు. దీంతో 108 వాహనం ఆత్మకూరు నుంచి పెచ్చెర్వు గూడేనికి బయల్దేరింది. ఆ సమయంలో నొప్పులు అధికం కావడంతో ఆటవీశాఖ అధికారులు పాలస్ట్ వాహనంలో నాగమ్మ ఆత్మకూరుకు తీసుకురాసాగారు. రోళ్లపెంట వద్ద గిరిజన మహిళను 108 వాహనంలోకి ఎక్కించారు. ఈఎంటీ నాగేష్, సంజీవరెడ్డి సుఖ ప్రసవం చేశారు. గిరిజన మహిళ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన నెల్లికొప్పుల రవికుమార్(32) తన ఇంట్లో బెడ్ రూంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నెల్లి కొప్పుల రవికుమార్ కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపంతో మంగళవారం సాయంత్రం బీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య ప్రమీలతోపాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మకూరు ఎస్‌ఐ వెంకట నారాయణ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



రైతులు వేసిన పంటల్లో నేషనల్ హైవే నిర్మాణం చేపట్టిన దృశ్యం

నందికొట్కూరు: హైవే నిర్మాణ పనులతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు 10 బొల్లవరం గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. పంటలు సాగు చేసిన పొలాల్లో కర్నూలు–గుంటూరు నేషనల్ హైవే నిర్మాణ పనులు చేపట్టడంతో నష్టం వాటిల్లిందని మంగళవారం 10 బొల్లవరం గ్రామానికి చెందిన రైతులు లక్ష్మీనారాయణరెడ్డి, ఎల్లప్ప, రామచంద్రుడు, మునిస్వామి, చిట్టెన్న, ఆదామ తదితరులు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో ఆయన వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల గోడును వివరించారు. నష్టపరిహారం అందజేసేలా కోరారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆర్టీఓ మిరియాల దాసు ఆ గ్రామానికి చేరుకొని పంటలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టం పరిహారం ఇప్పిస్తామని హామీచ్చారు. దీంతో 10 బొల్లవరం రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

కొత్తపల్లి: వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సింగిల్ విండో చైర్మన్ జనార్దన్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి, లింగస్వామి, గంగన్న, బాలస్వామి, వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం గోకవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు కేవలం 2 నుంచి 3 గంటలు కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్



జగనన్న కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, హౌసింగ్ పీడీ

నందికొట్కూరు: జగనన్న లే అవుట్-1, 2లో ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయి కనెక్షన్ మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ సమీపంలోని జగనన్న లే అవుట్ వేస్తున్న రోడ్డును హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో నందికొట్కూరు జగనన్న కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోనే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. కాలనీలో నివాసం ఉండే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు, కుళాయి పనులు చకచకా సాగుతున్నాయన్నారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ కిషోర్, హౌసింగ్ ఈఈ ఉమామహేశ్వర్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ అరుణకుమార్, మున్సిపల్ ఏఈ కృష్ణ లత, తదితరులు ఉన్నారు.

రుణాలను సక్రమంగా రికవరీ చేయండి



మాట్లాడుతున్న స్త్రీనిధి కోఆర్డినేటర్ నాగేంద్రప్రసాద్

జూపాడుబంగ్లా: పొదుపు మహిళలకు ఇచ్చిన రుణాలు సక్రమంగా రికవరీ చేయించాలని స్త్రీనిధి కోఆర్డినేటర్ నాగేంద్రప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయంలో సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధిలో పొదుపు మహిళలకు బాగస్వాములను చేయడంతో పాటు వారికి రుణాలు మంజూరు చేసి జీవనోపాధులు మెరుగుపడేలా చేయాలని సూచించారు. రుణాలు తీసుకున్న వారితో యూనిట్లు ఏర్పాటు చేయించడంతో పాటు వాల జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. రుణాల రికవరీలో అలసత్వం పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం అంబమ్మ, వైకేపీ సీసీలు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పొదుపు మహిళల స్టాళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

నందికొట్కూరు: ఆహా క్యాంటీన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ మార్కెట్ మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ప్రదర్శనలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు శుచి శుభ్రతతో ఇంటి వద్ద తయారు చేసిన వంటకాలు ఆహా క్యాంటీన్‌లో సరసమైన ధరలకు అమ్మడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మంజూనాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు హమీద్, ఎలిషా స్పెషలిస్ట్ జిలానీబాషా, మెప్మా సీఎంఎం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిడ్యాల: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మండ్లమల్లేశ్వరి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. తాగునీటిశాఖ ఏఈ శివకుమార్ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తుండగా కొణిదేల సభ్యుడు ఆస్లాంబాషా కల్పించుకొని ప్రాతకోట ఎస్సీ కాలనీలో జీఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని దాన్ని తొలగించి నిర్మితం ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నెహ్రూనగర్ నుంచి మార్కపురం ఎస్సీకాలనీలో రోడ్డు వాల్వులు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ మండ్ల చంద్రమోహన్‌నాయుడు కోరారు. సభ్యులు తెలిపిన సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే విద్యుత్ కోతలపై జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీటీసీ సుధీర్, ఎంపీటీసీ సభ్యులు ఏఈ క్రాంతికుమార్‌పై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోరెల్లి క్యామలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలకుడికి అండగా నిలవండి

- అన్ని వర్గాలు మెచ్చేలా జగనన్న పాలన
- పారదర్శకంగా పథకాల అమలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. పథకాల అమలులో రాష్ట్రంలో పేదల జీవనప్రమాణాలు పెంపొందేందుకు కృషి చేస్తున్న ఆయనను మరోసారి ఆశీర్వదిస్తేనే మనకు అన్ని పథకాలు మళ్లీ వస్తాయన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో మంగళవారం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి 122వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్, మాజీ ఎంపీపీ నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఎమ్మెల్యేకు అపూర్వస్వాగతం పలికారు. నూతనంగా నిర్మించిన సచివాలయం, రూ.పదిలక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రాత్రి వరకు ఇంటింటికి తిరిగి నాలుగేళ్ల కాలంలో పేదలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

5,211 మందికి రూ. 17కోట్ల లబ్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల్లో భాగంగా 21రకాల పథకాలకు సంబంధించి తిమ్మాపురంలో 5,211 మందికి రూ. 17కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణం చురుకుగా సాగుతోందన్నారు. 23 శాతం జీతం పెంచినందున సెర్ప్ ఉద్యోగులు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మహానంది ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, ఎంపీటీసీ శిరిగిరి పెద్ద స్వరూప, తిమ్మాపురం సొసైటీ చైర్మన్ వడ్ల నాగరాజు, గొర్రెల పెంపకందారుల రాష్ట్ర డైరెక్టర్ సుబ్బయ్యయాదవ్, నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, భక్తరెడ్డి, కల్లె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పాకు భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న తిమ్మాపురం ప్రజలు

పోతిరెడ్డిపాడు నుంచి 7,500 క్యూసెక్కుల నీటి సరఫరా

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 7,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో 859.40అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 858.40 అడుగులు ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు 5 గేట్ల ద్వారా 7,500 క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బనకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ ద్వారా తెలుగుగంగ కాల్వకు 4,000 క్యూసెక్కులు, ఎస్సార్బీసీ (జీఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 3,000, కేసీ ఎస్కేప్ కాల్వకు 500 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నట్లు ఏఈ దేవేంద్ర వివరించారు.

నీళ్లిచ్చి రైతులను ఆదుకోవాలి

మహానంది: రైతులు సాగు చేసే పంటలకు సరిపడా నీళ్లిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం గాజులపల్లెలో రాయలసీమ రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీమ జలాలపై హక్కులను సీమ రైతులు వెంటేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ దండోరా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్‌యాదవ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే శిక్షార్హులు

మహానంది: బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరంగా శిక్షార్హులని బండిఆత్మకూరు ఎంఈఓ-2 వాసుదేవగుప్త తెలిపారు. బండిఆత్మకూరులో మంగళవారం బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులు కష్టపడి చదివించాలన్నారు.

ఓటరు సర్వేకు సహకరించాలి

ఆత్మకూరు: మండలంలో ఓటరు సర్వేకు రాజకీయ నాయకులు సహకరించాలని తహసీల్దార్ ఉమాదేవి కోరారు. ఈ నెల చివరి వరకు ఓటరు జాబితాలో సవరణలు చేపడుతున్నామన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో 18 సంవత్సరాలు నిండి అర్హులైన యువతీ యువకుల పేర్లను కొత్తగా నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్: సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాసరావు, లోక్‌అదాలత్ సెక్రటరీ వెంకట నాగశ్రీనివాస్ కోరారు. స్థానిక కోర్టులో మంగళవారం సీనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ కార్యక్రమంలో రాజీ పడే క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదా, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ తదితర కేసులకు సంబంధించి ఇరు వర్గాలతో చర్చించి.. కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్‌జడ్జి తేజసాయి, డీఎస్పీ శ్రీనివాసరావు, కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉమాదేవి, ఆత్మకూరు సీఐ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జిల్లా జడ్జి శ్రీనివాసరావు

త్వరగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు వెంటనే ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 10,022హెక్టార్లు కాగా ఇప్పటిదాకా 70శాతం మేర సాగు చేశారన్నారు. అలాగే కర్నూలు–కడప కాల్వ కింద ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొవడంతో డ్యాంలలో గరిష్ఠస్థాయి నీటిమట్టం చేరుకోలేదన్నారు. అందువల్ల కేసీ కాల్వకు సాగునీరు ఎప్పటిదాకా నీరు విడుదల చేస్తారనే విషయమై స్పష్టత లేదన్నారు.

నందికొట్కూరు రూరల్: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలను వ్యవసాయాధికారుల వద్ద తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని ఏఓ షేక్షావలి రైతులకు సూచించారు. నమోదు చేయించుకుంటేనే పథకాలు వర్తిస్తాయన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకొని ఆధార్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. ఈనెల 28 తేదీన 80బన్నూరు, 24న తంగడంచ, తాటిపాడు, 25న మండ్లెం, పారుమంచాల గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. మండ్లెం-2, జూపాడుబంగ్లా-1 సచివాలయాల పరిధిలో 28 నుంచి 25తేదీ వరకు ఆధార్ కేంద్రాలు నిర్వహణ సేవలందిస్తాయన్నారు.

పాములపాడు: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. ఈ నెల 23న పాములపాడు, బానకచెర్ల, మద్దూరు, 24న మద్దూరు, రుద్రవరం, జూటూరు, 25న వేంపెంట, భానుముక్కల, తుమ్మలూరు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

పాములపాడు: ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందిస్తామని ఏడీఏ వసంతయ్య అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈఈ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలో 23వ తేదీ నుంచి వ్యవసాయానికి సంబంధించిన షెడ్యూల్‌ను ఖరారు చేశామన్నారు. ఏ గ్రూపుకు సంబంధించి రుద్రవరం వాటర్ వర్క్స్ ఫీడర్‌కు తెల్లవారుజామున నాలుగు నుంచి ఉదయం 11 గంటల వరకు 7 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. బీ గ్రూపు కంబాలపల్లి, వెలిమిల్ల ఫీడర్ కు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు. రైతులు గమనించాలని తెలిపారు.

సరైన సమయాల్లో బస్సు నడపాలి

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల నుంచి పాఠశాలలకు, కళాశాలలకు హాజరయ్యే విద్యార్థులకు సరైన సమయంలో బస్సు సర్వీసులను నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి దినేష్ కోరారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వస్తున్న విద్యార్థులకు బస్‌సర్వీసులు సమయానికి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, లింగేష్, సాయి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.